లెక్కల్లో ఇళ్లు.. క్షేత్రంలో లేరు

- 19,644 గృహాల నిర్మాణమే లక్ష్యం
- ఉగాదికి ప్రవేశం కష్టమే

జిల్లా	లక్ష్యం	పూర్తైనవి
కర్నూలు	9,466	200
నంద్యాల	10,178	169

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : పేదలకు గూడు కట్టిస్తామని గత వైకాపా ప్రభుత్వం హంగామా చేసింది. భూసేకరణ పేరుతో భారీ ఎత్తున నిధులు ఖర్చు చేసింది. గ్రామాలకు సుదూరంగా.. కొండలు.. గుట్టల్లో స్థలాలు కేటాయించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 600కుపైగా హౌసింగ్ కాలనీలు ఏర్పాటు చేసింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిధులు ఏమాత్రం సరిపోవంటూ చాలామంది నిర్మాణాలకు ముందుకు రాలేదు. కొందరు ఆసక్తి చూపినా నిధుల విడుదలతోనూ నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా చాలామంది ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే ఆపేశారు. 'కూటమి' ప్రభుత్వం వచ్చిన తర్వాత లబ్ధిదారులకు అదనపు సాయం అందిస్తోంది. ఉగాది నాటికి గృహాలు అందించాలని నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో పనులు ముందుకు కదలడం లేదు.

అధనం సమకూర్చినా

- బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలను అదనంగా నిధులు విడుదల చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉగాది నాటికి 19,644 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు పరిశీలిస్తే కేవలం 369 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి.
- ఉగాదికి ఒక్క రోజే గడువు ఉంది. . ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని పరిశీలిస్తే భూమికి.. ఆకాశానికి ఉన్నంత దూరం ఉంది. ఉమ్మడి జిల్లాలో కనీసం 500 నిళ్ల నిర్మాణాలు కూడా పూర్తి కాలేదు.
- కర్నూలు జిల్లాలో పరిశీలిస్తే బేస్‌మెంట్ లెవల్‌లో 7,735, నంద్యాల జిల్లా పరిధిలో 6,905 గృహాలు ఉండటం గమనార్హం. చాలామంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. అదనపు సాయం అందించినా ప్రయోజనం లేకపోయింది.

కొండకు గుండు

డోన్ పట్టణ పరిధిలో కొండను మింగేశారు. ఇటీవల బేతంచెర్ల నుంచి డోన్ మీదుగా చేపట్టిన జాతీయ రహదారి పనుల పేరుతో భారీగా తవ్వేశారు. ఈ కొండ అటవీ భూముల్లో ఉంది.. ఎలాంటి అనుమతుల్లేకుండానే తవ్వినట్లు సమాచారం. మట్టినంత తవ్విన తర్వాత అటవీ శాఖ నుంచి అనుమతులు రావడం గమనార్హం.
– న్యూస్‌టుడే, డోన్

సున్నం.. పంచాయతీకి కన్నం

- కొనుగోళ్లకు భారీగా ఆర్డర్లు
- చివరి దశలో సర్పంచుల కక్కుర్తి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: పల్లె ప్రథమ పౌరుల పదవీ కాలం మరో 15 రోజుల్లో ముగియనుంది. 'సమయం' ఉన్నప్పుడే నిధులు సర్దేసుకొనే పనిలో పడ్డారు. 'సున్నం' పేరుతో ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసే పనిలో పడ్డారు. అత్యవసరం పేరుతో పలు పంచాయతీల్లో తాగు నీటి క్లోరినేషన్, వీధుల్లో, మురుగు కాలువల్లో పరిశుభ్రత కోసం వినియోగించే బ్లీచింగ్ పౌడర్, సున్నం పెద్ద ఎత్తున కొనుగోళ్లు జరుగుతున్నాయి. అవసరం ఉన్నా లేకున్నా ఆర్డర్లు పెట్టారు. కానీ ఎక్కడా పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదు.

ముందు సరకు పంపిస్తే

- కర్నూలు జిల్లాలో 484, నంద్యాలలో 489 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 40 వరకు మేజర్ పల్లెలు ఉన్నాయి. ఆయా పంచాయతీల సర్పంచుల పదవీ కాలం ఏప్రిల్ 2వ తేదీతో ముగియనుంది.
- నాలుగు నెలల కిందట కర్నూలు జిల్లాకు రూ.17.64 కోట్లు, నంద్యాల జిల్లాకు రూ.16.09 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. సగటున ఒక్కో పంచాయతీ పరిధిలో అన్ని రకాల నిధులు కలిపి రూ.2 లక్షల వరకు ఉన్నాయి. అదే మేజర్ పంచాయతీల్లో రూ.5 లక్షల వరకు ఉన్నాయి.
- చాలా పంచాయతీల్లో రూ.20 వేల నుంచి రూ.25 వేల విలువ చేసే సున్నం, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలుకు ఆర్డర్లు పెట్టారు. మేజర్ పంచాయతీల్లో వీటి విలువ రూ.70 వేల వరకు ఉంది. ముందు సరకు పంపు.. బిల్లు తర్వాత చూసుకుందాం అనే రీతిలో వ్యవహరిస్తున్నారు.

హడావుడిగా తీర్మానాలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా పంచాయతీలు బేతంచెర్ల, తాడిపత్రి, రాయలచెరువు ప్రాంతాల నుంచి బ్లీచింగ్ పౌడర్, సున్నం కొనుగోలు చేస్తుంటాయి. గ్రామాల్లో జరిగే ప్రతి పనికి గ్రామ పంచాయతీ తీర్మానం కచ్చితంగా ఉండాల్సిందే. పాలకవర్గాలన్నీ వైకాపా మద్దతు దారుల గుప్పిట్లో ఉన్నాయి. పారిశుద్ధ్య ఖర్చుల పేరుతో హడావుడిగా తీర్మానాలు చేస్తున్నారు.
- రుద్రవరం, ఉయ్యాలవాడ, అవుకు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, కొత్తపల్లె, పాణ్యం, బేతంచర్ల, ప్యాపిలి, పాములపాడు, మిడుతూరు, వెలుగోడు, ఓర్వకల్లు, వెల్దుర్తి, ఆలూరు, కౌతాళం, మద్దికెర, కృష్ణగిరి, కోడుమూరు తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో హడావుడిగా తీర్మానాలు చేయడం గమనార్హం.

నాణ్యతకు తిలోదకాలు

- నాణ్యమైన బ్లీచింగ్ పౌడర్ (గ్రేడ్-1) ధర బహిరంగ విపణిలో 25 కిలోల సంచి రూ.1,250 వరకు ఉంది. సాధారణంగా కిలో బ్లీచింగ్ పౌడర్‌కు రెండు కిలోల సున్నం కలిపి వీధుల్లో, చెత్త కుప్పలున్న చోట చల్లుతారు.
- మొదటి రకం బ్లీచింగ్ పౌడర్‌తో పిచికారీ చేయడం కష్టం కావడంతో రెండో రకం బ్లీచింగ్ పౌడర్ రూ.750 నుంచి రూ.770 వరకు కొనుగోలు చేస్తున్నారు. 40 కిలోల సున్నం ధర రూ.400 వరకు ఉంది.
- చాలా పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్‌ను అంత నాణ్యమైంది కాకుండా మిగతా రకాలు వాడుతున్నారు. బిల్లులు మాత్రం నాణ్యమైన పౌడర్ ధరను 'కోడ్' చేస్తున్నారు.
- ట్యాంకుల్లో మంచినీటిని శుద్ధి చేయడానికి బ్లీచింగ్ పౌడర్‌కు బదులు 'ఇన్‌లైన్ ప్రోగ్రెస్ సిస్టమ్' విధానం అమల్లోకి వచ్చింది. నీటి నిల్వ అడుగు భాగంలో సబ్బు ఆకృతిలో ఉన్న క్లోరిన్(బిళ్లలు)ను ఉంచుతారు. నీళ్లు దీని మీద నుంచి రావడంతో శుద్ధి అవుతాయి. దీని ధర రూ.200 మాత్రమే.. 15 రోజుల వరకు పని చేస్తుంది. ధర తక్కువ కావడంతో దీనిపై దృష్టి సారించడం లేదు.

అక్రమాల ఉపాధి

సంజామల, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. 2024-25 ఆర్థిక ఏడాదిలో చేపట్టిన పనులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. వాటికి సంబంధించిన నివేదికలు సమర్పించడానికి మండల కేంద్రంలో మంగళవారం ప్రజావేదిక నిర్వహించారు. మండల వ్యాప్తంగా వెలుగులోకి వచ్చిన అక్రమాలను డ్వామా పీడీ వివరించారు. క్షేత్ర సహాయకులు రూ.31,030 నిధులు కాజేశారు.. అక్కంపల్లెలో రూ.8,732, పేరుసోముల రూ.3,596, గిద్దలూరు రూ.2,520, ఎగ్గోనిలోరూ.2,361 పక్కదారి పట్టాయి.

కదిలొస్తున్న కన్నడ భక్తులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైలానికి కన్నడ భక్తుల పాదయాత్ర కొనసాగుతోంది. మంగళవారం 30 వేల మందికి పైగా కన్నడ భక్తులు వెంకటాపురం నుంచి భీమునికొలను మీదుగా శ్రీశైలానికి పాదయాత్రగా తరలివచ్చారు. శ్రీశైలం చేరిన కన్నడ భక్తులు శ్రీస్వామి, అమ్మవార్ల ధూళి దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. తర్వాత పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించారు. దేవస్థానం ఏర్పాటు చేసిన తాత్కాలిక వసతి కేంద్రాల్లో బస చేస్తున్నారు. రోజుకు సగటున 60 వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్నారు.

బందోబస్తు కట్టుదిట్టం

ఉగాది మహోత్సవాలను పురస్కరించుకొని పోలీస్‌శాఖ బందోబస్తును కట్టుదిట్టం చేసింది. 10 మంది డీఎస్పీలు, 60 మంది సీఐలు, 150 మంది ఎస్సైలు, 2వేల మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు. 6 టోయింగ్ వాహనాలతో ట్రాఫిక్‌ను చక్కదిద్దే పనులు చేపట్టారు. 4 డ్రోన్ కెమెరాల ద్వారా శ్రీశైల క్షేత్ర పరిసరాల్లో వాహనాల రాకపోకలను పరిశీలిస్తున్నారు. వేల సంఖ్యలో వాహనాలు వస్తుండడంతో 15 మొబైల్ పార్టీలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్ సిబ్బంది విస్తృత తనిఖీలు చేస్తున్నారు.

కరెంటు వంట కాక

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎండలు మండుతున్నాయి. జనం బయటకు రావాలంటేనే హడలుతున్నారు. మరోవైపు పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో జనం ఎక్కువగా 'విద్యుత్తు స్టవ్'లు వినియోగిస్తున్నారు. ఎండల నేపథ్యంలో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు 24 గంటల పాటు నడుస్తున్నాయి. ఫలితంగా విద్యుత్తు వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాధారణ వాడకం కంటే 2 ఎంయూ నుంచి 3 ఎంయూ (ఒక ఎంయూ పది లక్షల యూనిట్లకు సమానం) వాడకం పెరిగింది.

రెండింతలు పెరిగింది

గత మూడేళ్లుగా విద్యుత్తు వాడకం (ఎంయూలలో..)

తేదీ	ఏడాది	కర్నూలు	నంద్యాల
15	2024	7.73	8.65
15	2025	7.74	7.81
15	2026	11.60	9.02

✦ గ్యాస్ సిలిండర్లు లభించకపోవడంతో ప్రస్తుతం వంట కోసం జనం ఎక్కువగా ఇండక్షన్ కుక్‌టాప్‌లు, ఎలక్ట్రిక్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్లు వాడుతున్నారు. ఫలితంగా విద్యుత్తు డిమాండ్ పైపైకి వెళుతోంది. చిన్న ఇండక్షన్ కుక్‌టాప్‌లు 2 వేల వాట్ల సామర్థ్యం కలిగి ఉంటాయి. ప్రస్తుతం వీటి వాడకం భారీగా ఉంది.

✦ విద్యుత్తు వినియోగాన్ని పరిశీలిస్తే గతేడాది మార్చి 15న కర్నూలు జిల్లాలో 7.748 ఎంయూ, నంద్యాలలో 7.815 ఎంయూ ఉండగా.. ఈ ఏడాది మార్చి 15న కర్నూలు జిల్లాలో 11.601 ఎంయూ, నంద్యాల జిల్లాలో 9.024 ఎంయూ వినియోగమవడం గమనార్హం.

పట్టణాల్లో అత్యధికం

ప్రస్తుతం 39 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు తదితర ఉపకరణాల వాడకం పెరిగిపోయింది. ప్రస్తుతం ఒక నెలలో పరిశీలిస్తే కర్నూలు డివిజన్ పరిధిలో 32.69 ఎంయూ వాడకం నమోదవగా.. నంద్యాల డివిజన్ పరిధిలో 33.26 ఎంయూగా ఉంది. కర్నూలు నగరంలో పరిశీలిస్తే 23.34, నంద్యాల పట్టణంలో పరిశీలిస్తే 10.96 ఎంయూగా ఉంది.

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాల సంబరం అంబరాన్నంటుతోంది. ఉత్సవాల రెండో రోజు మంగళవారం రాత్రి ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో శ్రీభ్రమరాంబాదేవి మహాదుర్గ అలంకారంలో కొలువుదీరారు. శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను నేత్రశోభితంగా ముస్తాబు చేసి కైలాస వాహనంపై అధిష్ఠింపజేశారు. ఉభయ దేవాలయాల అర్చకులు, వేదపండితులు సమంత్రకంగా దేవదేవులకు పుష్పార్చనలు చేసి మంగళహారతులు సమర్పించారు. మంగళవాయిద్యాలు, కళాకారుల సందడి నడుమ స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను గ్రామోత్సవానికి తీసుకువచ్చారు. 'సిరిగిరి మల్లయ్య' అని మనసారా పిలుచుకునే మల్లికార్జునస్వామి తన దేవేరితో కలిసి దర్శనమివ్వడంతో వేలాది మంది కన్నడ భక్తులు ఆధ్యాత్మిక పరవశం చెందారు. గ్రామోత్సవంలో కేరళ మహిళల స్వాగత నృత్యాలు, కోలాటాలు, కళాకారుల వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

స్వామి, అమ్మవారు

గ్రామోత్సవంలో సందడి

కైలాస వాహనంపై సిరిగిరి మల్లయ్య

ఉగాది మహోత్సవాల్లో మూడో రోజు బుధవారం సాయంత్రం 5.30 గంటలకు ఆలయ ప్రధాన పురవీధిలో స్వామి, అమ్మవార్లకు ప్రభోత్సవం జరగనుంది. రాత్రి 7 గంటలకు ఉత్సవమూర్తులకు నందివాహనసేవ జరుగుతుంది. అమ్మవారు మహాసరస్వతి అలంకారంలో దర్శనమివ్వనున్నారు.

వేగంగా ఆగిపోతున్న ఊపిరి

- జాతీయ రహదారులపై ప్రమాదాలు
- రోడ్డు అంచులో వాహనాల నిలిపివేత

డోన్, డోన్ గ్రామీణం, న్యూస్‌టుడే: నిత్యం పది వేల వాహనాలు రాకపోకలు సాగించే జాతీయ రహదారి (44)పై వేగంగా ప్రాణాలు ఆగిపోతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 84 కి.మీ. మేర ఎన్‌హెచ్-44 విస్తరించి ఉంది. హైదరాబాద్- బెంగళూరు మధ్య 120 కి.మీ వేగంతో వాహనాలు వెళ్తుంటాయి. లారీలు, ప్రైవేటు బస్సులు డోన్ సమీపంలోని హోటళ్ల వద్ద అడ్డంగా నిలుపుతున్నారు. వాహనాలను అధిగమించే (ఓవర్‌టేక్) సమయంలో ముందు వెళ్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

జాతీయ రహదారి నుంచి డోన్ పట్టణంలోకి మలుపు తిరిగే ప్రాంతంలో ఆగిన వాహనాలు

● వాహనం మరమ్మతులకు గురైనా.. చోదకులు విశ్రాంతి తీసుకొనేందుకు పలుచోట్ల ట్రక్‌బేలు ఏర్పాటు చేశారు. అక్కడ కనీసం నీటి వసతి లేదు. కర్నూలు నుంచి పోతుదొడ్డి వరకు ఒకే టోల్‌గేటు ఉన్నా అక్కడా సరైన విశ్రాంతి గదులు లేవు. మరుగుదొడ్ల పరిస్థితి అంతంతే. చేసేది లేక లారీలు, ట్రక్కులు, ఇతర వాహనాల డ్రైవర్లు హోటళ్లు, దాబాల వద్ద జాతీయ రహదారిని ఆనుకొనే నిలిపివేస్తున్నారు.

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2022	529	286	610
2023	443	280	598
2024	414	271	445
2025	542	279	412

● హోటళ్ల వద్ద నిలిపేందుకు అతివేగంతో వచ్చే వాహనాలు వెంటనే పక్కకు తిరుగుతుండటంతో వెనకవైపు వచ్చేవి అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతుంటాయి. హోటళ్ల వద్ద సరైన పార్కింగ్ స్థలాలు లేక రోడ్డుకు ఆనుకునే నిలుపుతున్నారు.

● యు.కొత్తపల్లె కూడలిలో డోన్‌లోకి వాహనాలు వెళ్లొచ్చే ప్రాంతంలోనే హోటల్ ఉంది. ఇక్కడ పెద్దఎత్తున వాహనాలు నిలుపుతుంటారు. దీంతో మలుపు తిరగాలంటే ఇబ్బందులు తప్పడం లేదు.

● పలుచోట్ల సంచార అల్పాహార, భోజన కేంద్రాలు (మొబైల్ క్యాంటీన్లు) ఉన్నాయి. దీంతో రహదారిపైనే వాహనాలు నిలిపి టిఫిన్, భోజనాలు చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

రూ.3 కోట్లు పెట్టారు.. విశ్రాంతి ఇచ్చారు

ఆళ్లగడ్డ, శిరివెళ్ల, న్యూస్‌టుడే: పదేళ్ల కిందట రూ.1,750 కోట్లు వెచ్చించి హైదరాబాద్- తిరుపతి జాతీయ రహదారి(40)ని నిర్మించారు. దీనిపై నిత్యం 7,500 వరకు వాహనాలు వెళ్తుంటాయి. సగటున ఒక్కో వాహనానికి రూ.350పైగా పన్ను వసూలు చేస్తున్నారు. జిల్లా సరిహద్దు చాగలమర్రి టోల్‌ప్లాజా వద్ద రూ.45 లక్షల వరకు టోలు వసూలు అవుతోంది.

ఇంత కీలకమైన రహదారిపై సౌకర్యాలు కల్పించడంలో హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వైఫల్యం కన్పిస్తోంది. వాహనదారులు విశ్రాంతి తీసుకోవడానికి అనువైన చోటు లేదు. ఎక్కడపడితే అక్కడ ఆపుతున్నారు. ఇవి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి.

● కడప- కర్నూలు మధ్య 200 కి.మీ. మేర ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్రతి 60 కి.మీ. ఒక చోట విశ్రాంతి (రెస్టు ఏరియా) నిర్మించాల్సి ఉంది. శిరివెళ్ల మండలం యర్రగుంట్ల, వైఎస్సార్ కడప జిల్లాలో దువ్వూరు వద్ద ఉన్నాయి. వీటికి రూ.3 కోట్ల వరకు వెచ్చించారు. ఇక్కడ మరుగుదొడ్లు, స్నానపు గదులు, వాహనాల పార్కింగ్ సౌకర్యం తప్ప ఇతర సౌకర్యాలేవీ లేవు. 150 ట్రక్‌లు, లారీలు పార్కింగ్ చేసుకోవచ్చు. సౌకర్యాలు లేక ఎవరూ వాహనాలు నిలపడం లేదు.

అరకొర సౌకర్యాలతో ట్రక్‌బే

● జాతీయ రహదారిపై ఆరు చోట్ల ట్రక్‌బేలు ఉన్నాయి. ఇక్కడా మౌలిక సదుపాయాల కొరత వేధిస్తోంది. మంచినీటి సౌకర్యం లేదు. మరుగు దొడ్లకు తలుపులు లేవు. మూత్రశాలలు పనిచేయవు.

ప్రజారోగ్యం ఫ్రై

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: అధికారుల నిర్లక్ష్యం ప్రజల ఆరోగ్యానికి శాపంగా మారింది. హోటళ్లు, దుకాణాలు, ఆహార తయారీ కేంద్రాలను ఆహార భద్రత అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలి. నమూనాలు సేకరించి బాగాలేనివి, నిబంధనలు పాటించని వాటిపై చర్యలు తీసుకోవాలి. నంద్యాల పట్టణంలో ఆహార భద్రత అధికారులు తూతూ మంత్రంగా దాడులు చేసి.. నమూనాలు సేకరించి నామమాత్రపు జరిమానాలు విధిస్తున్నట్లు ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల తనిఖీలు కొరవడటంతో ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడింది.

నంద్యాలలో ఓ దుకాణం వద్ద నల్లగా కాగిన నూనె

తనిఖీలు మరిచారు

- ❑ కల్తీ జరిగినట్లు గుర్తిస్తే జిల్లా ఆహార భద్రత అధికారులు నమూనాలు సేకరించి సంబంధిత ల్యాబ్‌లకు పంపించాలి. 14 రోజుల వ్యవధిలో రిపోర్టు వస్తుంది. దీని ఆధారంగా కేసులు నమోదు చేసి జేసీ కోర్టుకు నివేదించాల్సి ఉంటుంది.
- ❑ జిల్లాలోని 28 మండలాల్లో 14 మండలాలు డివిజన్-1గా, మరో 14 మండలాలను డివిజన్-2గా విభజించి ఇద్దరు అధికారులు ఉన్నారు.
- ❑ పలు హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ఆహార పదార్థాలు తయారు చేసే గదులను, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ తదితరాలను అధికారులు తనిఖీ చేయడంలేదు.

పలుమార్లు వినియోగం

- ❑ పట్టణంలోని హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, బేకరీల్లో నాణ్యతలేని, కల్తీ పదార్థాలను కలిపి విక్రయాలు చేస్తున్నారు. కూరగాయలు ఫ్రై చేయడానికి నూనెను 5 సార్లు, మాంసాహారాన్ని ఫ్రై చేసే నూనెను మూడు సార్లు వాడి పడేయాలి.
- ❑ పట్టణంలోని హోటళ్లు, దుకాణాల్లో నూనె నల్లగా మారినప్పటికీ.. వాడిన నూనె మళ్లీ వాడి ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారు.
- ❑ వీటిని తిన్న ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. నల్లగా మారిన నూనెతో క్యాన్సర్, అల్సర్, మూత్రపిండాలు దెబ్బతినడం వంటి సమస్యలు వస్తున్నట్లు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

– వెంకట రాముడు, జిల్లా ఆహార భద్రత అధికారి, నంద్యాల

పట్టణంలోని హోటళ్లు, బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ఆహార భద్రత నియమాలు పాటించాలి. వంట గది పరిశుభ్రంగా ఉండేలా, డ్రైనేజీ బాగా వెళ్లేలా ఉండాలి. ఆహార పదార్థాల్లో సింథటిక్ ఫుడ్ కలర్లు, టేస్టింగ్ సాల్ట్ ఉపయోగించరాదు. వాడిన నూనెను మళ్లీమళ్లీ వాడకూడదు. నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

కాల్వబుగ్గ ఆలయంలో భారీ చోరీ

- 9.50 కిలోల వెండి అపహరణ

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : పవిత్ర పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గలోని బుగ్గరామేశ్వరస్వామి ఆలయంలో భారీ చోరీ జరిగింది. మంగళవారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి ప్రవేశించి స్వామి, అమ్మవారికి చెందిన వెండి వస్తువులు అపహరించారు. స్వామివారి నాగాభరణం, అమ్మవారి పీఠం, అమ్మవారి వద్దనున్న సింహం తదితర వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. మొత్తం 9.50 కిలోల వెండి అపహరణకు గురైందని.. వీటి విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని ఎస్సై సునీల్‌కుమార్ తెలిపారు. హుండీలను సైతం దొంగలు పగులగొట్టారు. అందులో రూ.3 వేల నుంచి రూ.4 వేల నగదు ఉంటుందని అంచనా వేస్తున్నారు. శివరాత్రి తర్వాత హుండీల లెక్కింపు చేపట్టి వచ్చిన మొత్తాన్ని బ్యాంకులో జమ చేశారు. లేకుంటే భారీ మొత్తంలో నగదు అపహరణకు గురైఉండేది. ఆలయ అర్చకులు కళ్లే లక్ష్మీనారాయణ శర్మ, నరసింహయ్యశర్మలు ఉదయం స్వామి, అమ్మవారికి పూజలు చేసేందుకు ఆలయంలోకి రాగా.. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఆలయంలోని పలు సీసీ పుటేజీలను పోలీసులు పరిశీలించారు. దుండగులు మహారాష్ట్రకు చెందినవారుగా అనుమానం వ్యక్తం చేశారు. త్వరలో కేసును ఛేదిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం

బనగానపల్లి ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన కొనసాగుతుందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. పెద్దరాజుపాలెంలో రూ.25లక్షలతో నిర్మించిన సీసీ రహదారులు, చెర్లోకొత్తూరు గ్రామంలో రూ.31 లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు ప్రారంభోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు వస్తుంటే వైకాపా నాయకుడు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. రైతన్న మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ఇటీవల రహదారి ప్రమాదంలో గాయపడిన భూపాల్‌రెడ్డిని పరామర్శించారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, తెదేపా నాయకులు భూషన్న, బాబయ్య, పాతపాడు సర్పంచి మహేశ్వరరెడ్డి, యాగంటి ఛైర్మన్ మౌళీశ్వరరెడ్డి, తెదేపా నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులున్నారు.

రంజాన్ వేళలు

పట్టణం:	ఇఫ్తార్ (బుధ)	సహెరీ (గురు)
కర్నూలు :	6:34	5:01
నంద్యాల :	6:30	5:02
ఆదోని :	6:32	4:59
ఆళ్లగడ్డ :	6:30	5:05
బనగానపల్లి :	6:32	4:59

– న్యూస్‌టుడే (కర్నూలు పాతబస్తీ)

రైలులో ఆధ్యాత్మిక యాత్ర

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: వేసవి సెలవులు వచ్చేస్తున్నాయి.. తీర్థయాత్రలు చేయాలనుకునేవారికి. . ఆధ్యాత్మిక ప్రదేశాలు చూడాలనుకునేవారికి రైల్వే శాఖ రాయితీ ప్రకటించింది. ఒకే టికెట్‌తో పలురకాల తీర్థయాత్రలు చేయొచ్చు. ఇలాంటి వారికోసం దక్షిణ మధ్య రైల్వే విభాగం.. హైదరాబాద్ నుంచి 'సర్క్యులేటింగ్ జర్నీ టికెట్' సదుపాయాన్ని కల్పిస్తోంది.

సాధారణ ఛార్జీలతో పోల్చితే 25 శాతం తక్కువతో వివిధ ప్రదేశాలను సందర్శించే అవకాశం ఉంటుంది. సర్క్యులేటింగ్ జర్నీ టికెట్ పొందితే కాచిగూడ, సికింద్రాబాద్, నాంపల్లి రైల్వేస్టేషన్ల నుంచి 19 యాత్రలు అందుబాటులో ఉంటాయి.

ఎక్కడెక్కడికి వెళ్లొచ్చంటే..

- ❍ కాచిగూడ- ఔరంగాబాద్- ఉజ్జయిని- భద్రాచలం రోడ్- తిరుపతి- చెన్నై సెంట్రల్- బెంగుళూరు సిటీ- మైసూర్- హుబ్బళ్లి- సికింద్రాబాద్.
- ❍ మంత్రాలయం- తిరుపతి- బెంగుళూరు సిటీ- చెన్నై సెంట్రల్- భద్రాచలం- నాంపల్లి హైదరాబాద్.
- ❍ భద్రాచలం రోడ్- హైదరాబాద్- ముంబయి- పూరి- వారణాసి- ఫైజాబాద్- హౌరా- రిషికేష్- ఢిల్లీ.
- ❍ సికింద్రాబాద్- బీజాపూర్- కొల్హాపూర్- వాస్కోడిగామా- మైసూర్- తిరుపతి- చెన్నై సెంట్రల్- భద్రాచలం రోడ్- హైదరాబాద్.
- ❍ వీటితో పాటు మరో 15 ప్రయాణాలకు సదుపాయాలున్నాయని రైల్వే శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

నిబంధనలు ఇవే..

- ❍ ఒక టికెట్‌పై గరిష్ఠంగా ఎనిమిది బ్రేక్ ప్రయాణాలు చేసేందుకు అనుమతి ఉంటుంది.
- ❍ 56 రోజుల వరకు గడువు ఉంటుంది. (ఇది ప్రయాణ దూరానికి తగ్గట్టు మారుతుంది.. రోజులు మారవచ్చు)
- ❍ వృద్ధులకు అదనపు రాయితీలు (పురుషులకు 40 శాతం, మహిళలకు 50 శాతం) ఉంటాయి.
- ❍ వేర్వేరు రైళ్లు మారొచ్చు.

ఎలా చేసుకోవాలి

- ❍ ముందుగా సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్లలోని డివిజనల్ కమర్షియల్ మేనేజర్ లేదా సంబంధిత చీఫ్ రిజర్వేషన్ సూపర్‌వైజర్ కార్యాలయంలో సంప్రదించాల్సి ఉంటుంది.
- ❍ ఎంపిక చేసిన ప్రయాణానికి సంబంధించి ఛార్జీలు లెక్కించి ఫారం అందిస్తారు.
- ❍ ఆ ఫారంతో బుకింగ్ కౌంటర్‌లో టికెట్ తీసుకునే అవకాశం ఉంది. టికెట్ తీసుకున్న తర్వాత విడివిడిగా రిజర్వేషన్ చేయించుకోవాలి. అలా చేస్తే రిజర్వేషన్ నిబంధనల ప్రకారమే బెర్త్ లభిస్తుంది.
- ❍ అలా కాకపోతే ఆర్ఏసీ లేదా అన్ రిజర్వ్‌డ్ కోచ్‌లో ప్రయాణం చేయొచ్చు.
- ❍ 60 రోజుల ముందుగా, నాన్ సీజనల్ సమయంలో ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది..

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97628
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 13479

(c) eenadu

హలో.. ఇటు చూడండి

నంద్యాల పట్టణంలోని నూనె పల్లె నుంచి ఎన్జీవో కాలనీకి వెళ్లే రహదారిలో టెలిఫోన్ బాక్సు తుప్పు పట్టి దారిలోకి వాలి ప్రమాదకరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో రాత్రిళ్లు దూరం నుంచి ప్రయాణించే వాహనదారులు దీన్ని గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. దీనివల్ల వాహనదారుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. -న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

ముఖ్యమంత్రికి పెళ్లిపత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు దంపతులు

పెళ్లికి రావాలని సీఎంకు ఆహ్వానం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌ను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, తెదేపా నేత గౌరు వెంకటరెడ్డి, అనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు మంగళవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఏప్రిల్ 2న హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్‌లో జరిగే గౌరు జనార్దన్‌రెడ్డి, సనాతనీల వివాహానికి హాజరుకావాలని కోరుతూ పెళ్లి పత్రిక అందజేశారు.

ఉగాది ఉత్సవం కళా వైభవం

శ్రీశైలంలో ఉగాది మహోత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి శ్రీస్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. వేడుకల్లో కళాకారుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్‌ను రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ల సంఘం అధ్యక్షుడు, నంద్యాల మార్కెట్‌యార్డు ఛైర్మన్ జి.హరిబాబు కలిశారు. మంగళవారం మంగళగిరిలో మార్కెట్‌యార్డు ఛైర్మన్లతో కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ మార్కెట్‌యార్డు ఛైర్మన్లకు చెక్ పవర్ పునరుద్ధరించాలని, మార్కెట్ కమిటీల పరిధిలోని లింకు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, కమిటీ ఛైర్మన్ల పదవీ కాలం మూడేళ్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు బజార్ల పర్యవేక్షణ యార్డు ఛైర్మన్లకు ఇవ్వాలన్నారు. నియోజకవర్గాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో ఛైర్మన్లకు ప్రొటోకాల్ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కొండ ప్రవీణ్, ఉపాధ్యక్షులు అమర్నాథ్ యాదవ్, ఏరువా శ్రీనివాసులు, బర్రా వాసు, రామచంద్ర రాజు, కిరణ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న హరిబాబు

దివ్యాంగులకు దివ్యమైన కానుక

■ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు ఉగాది కానుకగా దివ్యాంగ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణానికి శ్రీకారం చుట్టింది. 40శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఎస్కార్ట్‌గా వచ్చే వ్యక్తికి టికెట్‌లో 50శాతం రాయితీ ఇస్తారు. కర్నూలు జిల్లాలో 31,138 మంది, నంద్యాల జిల్లాలో 25,780 మంది దివ్యాంగులకు లబ్ధి చేకూరనుంది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డీనరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇది కేవలం ఆర్థిక ఉపశమనం మాత్రమే కాకుండా, వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు దోహదపడుతుంది. అడ్డంకులను అధిగమించి దివ్యాంగులు తమ గమ్యం, లక్ష్యం చేరుకోవడానికి ఉచిత బస్సు ప్రయాణం ఒక వారధిలా నిలుస్తోంది. ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన కూటమి ప్రభుత్వానికి దివ్యాంగులు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

సహాయకులకు ఉచిత ప్రయాణం కల్పించాలి

- చంద్ర శేఖర్, స్పందన బ్లైండ్ పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు

దివ్యాంగులకు ఉచిత బస్సు పథకం వర్తింపజేయడం అభినందనీయం. బస్సుల్లో దివ్యాంగులకు ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలి. పూర్తిగా శారీరక వైకల్యం, మానసిక దివ్యాంగులు ఒక్కరే ప్రయాణించలేరు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం దివ్యాంగులకు తోడుగా వచ్చే ఎస్కార్ట్ వ్యక్తికి 50 శాతం రాయితీ ఇస్తోంది. ఎస్కార్ట్‌గా వచ్చేవారికి ఉచిత ప్రయాణం కల్పించాలి.

ప్రత్యేక సీట్లు కేటాయించాలి -డీపీ మస్తాన్ వలి

డిజైబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు

దివ్యాంగులకు బస్సులో 10 సీట్లు ప్రత్యేకంగా కేటాయించి, అమలు చేయాలి. యూడీ ఐడీ గుర్తింపు కార్డు, దివ్యాంగుల పాత ఆర్టీసీ బస్సు పాసులను, సదరం సర్టిఫికేట్లను పరిగణనలోకి తీసుకుని ఉచిత పాసులు ఇవ్వాలి. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన సీఎంకు ధన్యవాదాలు.

ఆర్థిక భారం తగ్గుతుంది - దేవరాజ్

జిల్లా దివ్యాంగ ఐకాస జిల్లా అధ్యక్షుడు

దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగం చేసుకునే వారికి, ఆరోగ్య పనుల నిమిత్తం ఆసుపత్రులకు వెళ్లే వారికి, పరీక్షలు రాసే వారికి ఆర్థిక భారం తగ్గుతుంది. పేద దివ్యాంగులకు ఎంతో ఉపయోగపడుతుంది. 2007 నుంచి దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణానికి పోరాటం చేస్తున్నాం. ఉచిత ప్రయాణం కల్పించిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు.

నెలాఖరు వరకు కేసీ చివరి ఆయకట్టుకు నీరివ్వాలి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఈ నెలాఖరు వరకు కేసీ చివరి ఆయకట్టుకు నీరివ్వాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. మంగళవారం అమరావతిలో ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే తన సోదరుడు భూమా విఖ్యాత్‌రెడ్డితో కలిసి సమావేశమయ్యారు. కేసీ కింద సాగవుతున్న పంటలకు ఇంకా నీటి తడులు అవసరమని, అందుకే ఈ నెలాఖరు వరకు నీటి విడుదలను కొనసాగించాలని కోరారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన పనుల కోసం నిధులను విడుదల చేయాలని ఎమ్మెల్యే ముఖ్యమంత్రిని కోరారు.

ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

యువతకు ఉపాధి

■ గ్రామీణాభివృద్ధికి అవకాశం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ఎస్బీఐ ఫౌండేషన్ యువతకు అవకాశం కల్పిస్తోంది. పల్లెల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో యువత పాల్గొనేందుకు ఎస్బీఐ యూత్ ఫర్ ఇండియా ఫెలోషిప్ అనే కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రముఖ ఎన్జీవోలతో కలిసి పని చేసే అవకాశం లభిస్తుంది. 2026-27కు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. 13 నెలల పాటు ఈ కార్యక్రమం ఉంటుంది. ఆరోగ్యం, వైద్యం, పర్యావరణం, మహిళా సాధికారత, జీవనోపాధి వంటి 12 గ్రామీణాభివృద్ధి రంగాల్లో ఏదో ఒక దానిపై పని చేయాల్సి ఉంటుంది. ఎంపికైన వారికి నెలవారీ స్టైఫండ్‌తో పాటు అదనపు ఖర్చులతో కలిపి రూ.19 వేలు ఇస్తారు. ఫెలోషిప్ పూర్తి చేసిన వారికి రూ.50 వేలు వస్తుంది. ఆసక్తి ఉన్న యువకులు ఏప్రిల్ 30వ తేదీలోగా యూత్‌ఫర్ ఇండియా.ఓఆర్జీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

అర్హతలు..

ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ తీసుకొని ఉండాలి. వయసు 21 ఏళ్ల నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి. భారతీయ పౌరులు, నేపాల్, భూటాన్ పౌరులతో పాటు ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్ ఇండియా కార్డు ఉన్నవారు అర్హులు.

ప్రయోజనాలు..

- 13 నెలల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుంది.
- ఫెలోషిప్ కింద ఎంపికైన వారికి ప్రతి నెలా స్టైఫండ్ కింద రూ.16 వేలు ఇస్తారు.
- ప్రయాణాల ఖర్చుల కింద నెలకు రూ.2 వేలు, ప్రాజెక్టు పనులకు రూ. వెయ్యి ఇస్తారు.
- ఫెలోషిప్ విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత రూ.లక్ష వరకు అలవెన్సు కింద లభిస్తుంది.
- ఫెలోషిప్ సమయంలో ఆరోగ్య, ప్రమాద బీమా వర్తిస్తుంది.
- ఫెలోషిప్ పూర్తయ్యాక సర్టిఫికేట్ ఇస్తారు.

జల నిర్వహణపై చర్యలు అవసరం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: శ్రీశైలం ప్రాజెక్టు జల నిర్వహణపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని రాయలసీమ సాగు నీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కేసీ కెనాల్‌కు సంబంధించి అమలులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు, బచావత్ ట్రైబ్యునల్ నిబంధనలు, రాష్ట్ర విభజన చట్టంలోని విధానాలను పరిగణనలోకి తీసుకుని నీటి విడుదలపై తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. సాగునీటి సలహా మండలి సమావేశానికి ముందుగానే రైతులు విస్తృతంగా పంటలు సాగు చేసిన నేపథ్యంలో కేసీ కెనాల్ ఆయకట్టుకు ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాల ద్వారా తక్షణమే నీటిని విడుదల చేయాలన్నారు. కుందూ నది పరివాహక ప్రాంతంలో నంద్యాల వరకు తాగు నీటి అవసరాల కోసం అలగనూరు కాల్వ ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. శ్రీశైలం రిజర్వాయర్ నిబంధనల ప్రకారం 854 అడుగుల కనీస నీటి మట్టం కంటే దిగువకు నీటిని విడుదల చేయకుండా విద్యుదుత్పత్తిని తక్షణమే నిలిపివేయాలన్నారు. సీమ నీటి హక్కులను కాపాడుతూ భవిష్యత్తులో నీటి సంక్షోభం తలెత్తకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు యర్రం శంకరరెడ్డి, కార్యవర్గ సభ్యులు నిట్టూరు సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బొజ్జా దశరథరామిరెడ్డి

ఈపీఎఫ్ కార్యాలయ చిరునామా మార్పు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్) జిల్లా కార్యాలయాన్ని మార్చినట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 ఎస్.శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నగరంలోని అశోక్‌నగర్ వద్దనున్న కార్యాలయాన్ని కర్నూలు సి.క్యాంపులోని క్వార్టర్ నంబరు-సీ/సీ-27, 28కు మార్చినట్లు చెప్పారు. అందరూ కార్యాలయ చిరునామా మార్పును గమనించి సేవలను పొందాలని కోరారు.

రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు

పంచ సూత్రాలతో లాభసాటి వ్యవసాయం

కొత్తపల్లె (నంద్యాల గ్రామీణం), న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన పంచ సూత్రాలను పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. మండలంలోని కొత్తపల్లె గ్రామంలో సర్పంచి నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూమి ఆరోగ్యం కాపాడేందుకు రాబోయే ఖరీఫ్‌లో తొలకరి వర్షాలు కురిసిన వెంటనే పచ్చిరొట్ట వేసుకోవాలన్నారు. దీని ద్వారా సేంద్రియ పదార్థాలు పెరిగి సూక్ష్మజీవులు వృద్ధి చెంది మొక్కలకు అవసరమైన అన్ని పోషకాలు అందుతాయన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలు అవుతున్న యాప్‌ల గురించి అవగాహన కల్పించారు. గ్రామంలోని పలువురి రైతుల ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి సందేశం కలిగిన పత్రాలను అందజేసి అందులోని సారాంశాన్ని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు, వ్యవసాయ విస్తరణ అధికారి మహేశ్, రైతు సేవాకేంద్రం సిబ్బంది సురేశ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మహిళను వేధించిన కేసులో ఏడాది జైలుశిక్ష

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళను లైంగికంగా వేధించిన కేసులో ముద్దాయికి ఏడాది జైలు, రూ.30 వేల జరిమానా విధిస్తూ ఆత్మకూరు కోర్టు న్యాయమూర్తి రాహుల్ అంబేడ్కర్ మంగళవారం తీర్పు వెలువరించారు. కొత్తపల్లి మండలం జీ.వీరాపురం గ్రామానికి చెందిన కదిరి రమణ 2017 ఆగస్టు 27న మహిళ ఇంటి వద్దకు వెళ్లాడు. మహిళ భర్తకు రూ.500 ఇచ్చి మద్యం తీసుకురమ్మని బయటకు పంపాడు. ఇల్లు కట్టుకోవడానికి లక్ష రూపాయలు ఇస్తానని లైంగికంగా వేధించాడు. లేకపోతే భర్తను చంపేస్తానని బెదిరించాడు. ఈ ఘటనపై బాధితురాలు కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఏపీపీ మైల బాబురాజేంద్ర ప్రసాద్ వాదనలు వినిపించారు. నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో కోర్టు తీర్పును వెలువరించింది. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన ఎస్సై జయశేఖర్, కోర్టు కానిస్టేబుల్ మల్లికార్జునను పోలీస్ ఉన్నత అధికారులు అభినందించారు.

మల్లన్న భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదం

శ్రీశైలం, నంది సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకునే భక్తులకు ఉగాది రోజున ఉచితంగా లడ్డూ ప్రసాదం అందజేయనున్నారు. మహారాష్ట్ర అక్కల్‌కోట్‌కు చెందిన బసిలింగప్పా కేడిగి కుటుంబ సభ్యులు తెలుగు సంవత్సరాన్ని పురస్కరించుకొని ఉగాది రోజున ప్రతి భక్తుడికి లడ్డూ ప్రసాదం అందజేయనున్నారు. నాలుగు తరాలుగా ఈ ఉచిత లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పంపిణీకి సిద్ధంగా ఉన్న లడ్డూలు

ఆం.ప్ర. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ
విజయవాడ

టెండరు ప్రకటన నెం.AGC58-LC0MISC/6/2026-ENGG, తేది: 17-3-2026
దిగువతెల్పిన ప్రదేశంవద్ద మెటీరియల్స్ కొనుగోలు మరియు గోదామును కూలగొట్టుటకై సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.

ఎ) వివరం: 4,000 మె.ట. ట్రస్‌టైపు గోదామును కూలగొట్టుట మరియు ట్రస్సులు, పర్లిన్స్, రోలింగ్ షట్టర్లు, స్లైడింగ్ గేట్లు, వెంటిలేటర్లు, ఎయిర్ ఇన్లెట్లు, రన్నర్లు, రూఫ్ షీట్లు మరియు ఇతర నిర్మాణ మెటీరియల్స్ వగైరాలాంటి అందుబాటులో ఉన్న మెటీరియల్స్‌ను కొనుగోలు చేయటం మరియు పని ఆఫీసర్ ఇంచార్జిచే సూచించబడిన విధంగా రోడ్డు లెవెల్ వరకు సైట్‌ను లెవెల్ చేయడం మరియు శిథిలాలను తొలగించిన తర్వాత గిడ్డంగి మేనేజర్, **ఆళ్లగడ్డ, నంద్యాల జిల్లావారికి** సైట్‌ను అప్పగించుట కొరకు టెండర. బి) టెండరు షెడ్యూలు **ధర: 590/- (జిఎస్‌టి పన్ను కలిపి)**, సి) దరఖాస్తుతోపాటు ఇ.ఎం.డి ని ఎండి, ఎపిఎస్‌డబ్ల్యుసి, విజయవాడ పేరిట తీసిన **రూ.1,00,000/-ల డి.డి. రూపంలో చెల్లించవలెను.** డి) టెండరు షెడ్యూళ్ళు జారీకి **తేది: 23-3-2026 నుండి 10-4-2026 సా.5 గం.వరకు.** ఇ) టెండర్ల స్వీకరణ **తేది: 23-3-2026 నుండి 13-4-2026 మ.3 గం.వరకు.** ఎఫ్) టెండర్లు తెరచు **తేది: 13-4-2026 మ.3.30 గం.లకు.** జి) కార్యాలయ వేళల్లో టెండరు షెడ్యూళ్ళు విక్రయించబడు మరియు ఏవేని తదుపరి వివరాల లభించు కార్యాలయం: మేనేజింగ్ డైరెక్టర్, ఏపిఎస్‌డబ్ల్యుసి, C/o స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్ బస్‌స్టాండ్ వెనుకవైపు, 2వ అంతస్తు, డి.నెం.55-17-9, సి-13, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఆటోనగర్, విజయవాడ.
ఇ-మెయిల్: apswhcenggsec@gmail.com, ఫోన్: 0866-2556244 మరియు గిడ్డంగి మేనేజర్, ఆళ్లగడ్డ, సెల్ నెం.8977934483.

సం/- మేనేజింగ్ డైరెక్టర్

మెరుగైన వైద్యసేవలు అందించాలి: మంత్రి బీసీ

బనగానపల్లి, న్యూస్‌టుడే: ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సూచించారు. మంగళవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో పర్యటించి రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఇన్‌పేషెంట్లకు భోజన వసతి, మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉమాదేవితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి బీసీ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో వైద్యసేవలు అందించడంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైతే తాను సొంత నిధులు వెచ్చిస్తానని అన్నారు. రోగులకు అందుబాటులో లేని వైద్యపరికరాల జాబితా తయారు చేసి తనకు వెంటనే ఇవ్వాలని సూచించారు. వైద్యపరికరాలు తెప్పించేందుకు ప్రయత్నం చేస్తామని అన్నారు. వైద్యులకు తన సంపూర్ణ సహకారం ఉంటుందని అన్నారు. వంద పడకల ఆసుపత్రిగా మారినా ఇప్పటికీ చాలా మంది రోగులను నంద్యాల, కర్నూలు ఆసుపత్రులకు పంపడం మంచిది కాదని అన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఇల్లూరుకొత్తపేట (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఇల్లూరుకొత్తపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని అభివృద్ధి పనులు పరిశీలించారు. శుద్ధ జలం లేకపోవడంతో మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామ సచివాలయాన్ని పరిశీలించి దస్త్రాలు తనిఖీ చేసి హాజరు వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఎట్టకేలకు స్థానాల కేటాయింపు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా 25 మంది ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లను గత నెలలో సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ)కు బదిలీ చేసిన విషయం విదితమే. ఇందులో కర్నూలు జిల్లా పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, నంద్యాల జిల్లా ఆత్మకూరు ఆర్డీవో దేశిరెడ్డి నాగజ్యోతి ఉన్నారు. వీరిద్దరికి ఎట్టకేలకు పోస్టింగ్ ఇచ్చారు. తిరుపతి జిల్లా గాలేరు నగరి సుజల స్రవంతి ప్రత్యేక ఉప కలెక్టర్ (ఎస్‌డీసీ)గా ఎస్.భరత్ నాయక్‌కు, వైఎస్సార్ కడప జిల్లా తెలుగుగంగ ప్రాజెక్టు యూనిట్-2 ప్రత్యేక ఉప కలెక్టర్‌గా నాగజ్యోతికి పోస్టింగ్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పోక్సోపై యువకుడి చైతన్య యాత్ర

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పోక్సో చట్టంపై ప్రజలకు అవగాహనతో పాటు ఆ చట్టం గురించి పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ పాఠ్యపుస్తకాల్లో పాఠాలు చేర్చాలని మంజునాథ్ అనే యువకుడు కోరారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం నుంచి అమరావతికి సైకిల్ యాత్ర చేపట్టాడు. సోమవారం రాత్రి బేతంచెర్లకు చేరుకోగా తెదేపా మండల కన్వీనర్ ఉన్నం ఎల్లనాగయ్య, తిరుమలేష్ చౌదరితో పాటు భాజపా నాయకులు మోహన్ స్వాగతం పలికి ఆశ్రయం కల్పించారు. అనంతరం యువకుడిని సత్కరించి అభినందించారు. నాయకులు అంజి, ఉపేంద్ర, వెంకటేశ్వర్లు, అరుణ్, మాధవ్ పాల్గొన్నారు.

యువకుడిని సత్కరించిన తెదేపా, భాజపా నాయకులు

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda

బ్యాంక్ ఆఫ్ బరోడా

బళ్ళారి రోడ్, కర్నూలు బ్రాంచి, జిల్లా పరిషత్ ఎదురుగా, అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్ ప్రక్కన, కర్నూలు -518001

సంక్షిప్త పద్ధతిన వాహనాలు ఇ-వేలం ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకమునకు మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు/ హామీదారులకు తెలియజేయునది ఏమనగా పార్టీలు అమలు చేసిన తనఖా / ఋణ ఒప్పందం కింద సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, క్రింద పేర్కొన్న తనఖాలో ఉన్న మోటారు వాహనాలు బ్యాంక్ తిరిగి స్వాధీనం చేసుకున్న / జప్తు చేయబడిన మరియు క్రింద పేర్కొన్న ఖాతా/ఖాతాలలో బకాయిలను వసూలు చేయడానికి వాహనం "ఎక్కడ ఉందో అలాగే", "ఎక్కడ ఉందో అలాగే" మరియు "ఏది ఉందో అలాగే" ప్రాతిపదికన విక్రయించబడునని ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

వ నెం.	ఋణగ్రహీత/లు/హామీదారు / తనఖాదారు/లు పేరు &చిరునామా	వాహనం తయారీ మోడల్ ఆర్‌టిఓ రిజిస్ట్రేషన్ నెం. రిజిస్ట్రర్ తేది	రిజర్వు ధర / ధరావతు (ఇఎండి)	బయానా (ఇఎండి) డిపాజిట్ ఖాతా నెం, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్, బ్రాంచ్ :	వాహనం పార్కింగ్ వివరములు
1)	శ్రీమతి గౌర చిన్నక్క, భర్త : చిన్న ఎరుకులయ్య, ఇంటి నెం 5-139, పెట్రోలు బంకు దగ్గర, పాలుకూరు గ్రామం, బనగానిపల్లి మండలం, నంద్యాల జిల్లా -518176, A/c No. 75650600004223	Make: ASHOK LEYLAND LTD Model: GOODS CARRIAGE - HMV Type of body: HSD Colour: WHITE, Fuel: DIESEL Reg No: AP39 VD 9975 Year of registration: 2024 Chassis No: MB1A4GCD3PRRS0395 Engine No: PRHZ435886 Seating capacity: 3	రిజర్వు ధర : Rs.10,53,000 EMD: Rs.1,05,300 బిడ్ పెంపుదల మొత్తం : Rs.15,000	/c # 75650015181869 (EMD to be deposited through Baanknet portal) A/c Name: SARFAESI Auction Proceeds A/c IFS Code: BARB0VJKURN (5th letter ZERO) Bank Of Baroda,Bellary Road Kurnool Branch.	Trucks parked at M/s. Maryhill Parking Yard, Maryhill,Konchady, Mangaluru, Karnataka-575 008 (12.9095°N/ 74.8609°E)
2)	మొత్తం బకాయిలు : తేది. రూ.47,18,898/- + తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు	Make: ASHOK LEYLAND LTD Model: GOODS CARRIAGE- HMV Type of body: HSD Colour: WHITE Fuel: DIESEL Reg no: AP39 VD 9976 Year of registration: 2024 Chassis No: MB1A4GCD2PRFM7417 Engine No: PFHZ425051 Seating capacity: 3	రిజర్వు ధర : Rs.10,53,000 EMD:Rs.1,05,300 బిడ్ పెంపుదల మొత్తం : Rs.15,000	/c # 75650015181869 (EMD to be deposited through Baanknet portal) A/c Name: SARFAESI Auction Proceeds A/c IFS Code: BARB0VJKURN (5th letter ZERO) Bank Of Baroda,Bellary Road Kurnool Branch.	Trucks parked at M/s. Maryhill Parking Yard, Maryhill,Konchady, Mangaluru, Karnataka-575 008 (12.9095°N/ 74.8609°E)
3)	శ్రీమతి యన్నం మంజుల, భర్త : విజయ కుమార్, ఇంటి నెం 5-231, పెట్రోలు బంకు దగ్గర, పాలుకూరు గ్రామం, బనగానిపల్లి మండలం, నంద్యాల జిల్లా -518176, A/c No. 75650600004370, 75580600005283.	Make: ASHOK LEYLAND LTD Model: GOODS CARRIAGE-HMV Type of body: HSD Colour: WHITE Fuel: DIESEL Reg no: AP39 VE 9973 Year of registration: 2024 Chassis No: MB1A4GCD9RRPS5646 Engine No: PREZ428756 Seating capacity: 3	రిజర్వు ధర : Rs.10,53,000 EMD:Rs.1,05,300 బిడ్ పెంపుదల మొత్తం : Rs.15,000	A/c # 75650015181869 (EMD to be deposited through Baanknet portal) A/c Name: SARFAESI Auction Proceeds A/c IFSCode: BARB0VJKURN (5th letter ZERO) Bank Of Baroda,Bellary Road Kurnool Branch.	Trucks parked at M/s. Star Parking Yard, Viswanath Hotel Backside, Autonagar, Guntur (16.328438/ 80.481792)
4)	మొత్తం బకాయిలు : తేది. రూ.51,32,280/- + తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు	Make: ASHOK LEYLAND LTD Model: GOODS CARRIAGE - HMV Type of body: HSD Colour: WHITE Fuel: DIESEL Reg no: AP39 VE 9974 Year of registration: 2024 ChassisNo: MB1A4GCD5RRPS0945 Engine No: PRHZ436149 Seating capacity: 3	రిజర్వు ధర : Rs.10,53,000 EMD:Rs.1,05,300 బిడ్ పెంపుదల మొత్తం : Rs.15,000	A/c # 75650015181869 (EMD to be deposited through Baanknet portal) A/c Name: SARFAESI Auction Proceeds A/c IFSCode: BARB0VJKURN (5th letter ZERO) Bank Of Baroda,Bellary Road Kurnool Branch.	Trucks parked at M/s. Star Parking Yard, Viswanath Hotel Backside, Autonagar, Guntur (16.328438/ 80.481792)

పైన తెలిపిన మొత్తం వాహనాల ఇ-వేలం తేది, సమయం: తేది.26-03-2026, గురువారం, మధ్యాహ్నం గం.02.00 నుండి సాయంత్రం గం.06.00 వరకు
వాహనం / చరాస్తి తనిఖీ తేది & సమయం: పార్కింగ్ యార్డ్ వద్ద తేది.17-03-2026 నుండి తేది.25-03-2026 ఉదయం గం.10.30 ని.ల నుండి సాయంత్రం గం.04.00 గం.ల వరకు
విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం ఆన్‌లైన్ ఆక్షన్ పోర్టల్ https://baanknet.com ను సందర్శించగలరు
ఆసక్తి గల బిడ్డర్లు శ్రీ ఎన్ మనోహర్ గారిని మొబైల్ నెం. 9618453468 సందు సంప్రదించవచ్చును.
తేది: 16-03-2026, ప్రదేశం: కర్నూలు సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

బెదిరింపుల కేసులో విద్యార్థి సంఘం నేత అరెస్టు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాలకు చెందిన ఎ.శ్రీధర్ నాయుడును కర్నూలు రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 16వ తేదీన కర్నూలులోని అంబేడ్కర్ భవన్ కార్యాలయంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ మద్దిలేటిని నిందితుడు కలిసి తాను ఓ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడినని పరిచయం చేసుకున్నాడు. హాస్టల్ వార్డెన్ల నుంచి అధిక మొత్తాలు వసూలు చేస్తున్నట్లు తనకు ఫిర్యాదులు వస్తున్నాయంటూ మద్దిలేటిని అతను బెదిరించే యత్నం చేశాడు. ఆధారాలుంటే చూపాలని ఆయన ప్రశ్నించగా మరింత బెదిరింపులకు గురిచేశాడు. ఈ నేపథ్యంలో మద్దిలేటి పలువురు వసతిగృహ వార్డెన్లతో కలిసి కర్నూలు రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ హాస్టల్‌లోకి శ్రీధర్ నాయుడు అక్రమంగా ప్రవేశించి బెదిరించి ఫోన్‌పే ద్వారా చందాలు వసూలు చేశారంటూ హాస్టల్ వార్డెన్లు సైతం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని వ్యక్తి ఆత్మహత్య

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: మండలంలోని కోట్లవారిపల్లెలో గ్రానైట్ ప్యాక్టరీ వద్ద ఓ వ్యక్తి మృతి చెందినట్లు మంగళవారం గ్రామీణ ఎస్సై మమత తెలిపారు. మండలంలోని కొచ్చెర్వు గ్రామానికి చెందిన కొమ్ము రాజు(26) తాగుడుకు బానిసైనందున భార్య మాధురి పుట్టింటికి వెళ్లిపోయింది. 6 నెలలైనా భార్య తిరిగి రాకపోవడంతో మనస్తాపం చెందిన రాజు కోట్ల వారిపల్లెలోని ఓ గ్రానైట్ ప్యాక్టరీ వద్దకు వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని ఎడమ ఎదపై భార్య పేరు మాధురి అని పచ్చబొట్టు రాసుకున్నాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



మృతి చెందిన కొమ్మురాజు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన పాములపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాములపాడు గ్రామానికి చెందిన అమర్(28) మద్యానికి బానిసై జీవనోపాధికి ఎలాంటి పనులు చేయడం లేదు. దీంతో కుటుంబసభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై ఈనెల 14న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య శ్యామల, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సెక్షావలి తెలిపారు.

మృతిచెందిన అమర్

EENADU Classifieds

JOBS

ఎయిర్ కాబిన్ క్రూ సర్వీసెస్‌లో పర్క్. చేయుటకు సూపర్‌వైజర్స్, టీం లీడర్స్. గ్రౌండ్ స్టాఫ్ కావలెను. శా॥ 26000 టు 31,000 ఫుడ్ ఫ్రీ. Cont:94936 77818.

కర్నూలులో సోలార్ ప్యానెల్ క్లీనింగ్ చేయుటకు బాయ్స్ కావలెను. జీతం: 10వేల నుండి 15వేల వరకు సంప్ర॥ కీర్తి సోలార్ పవర్ ఏజెన్సీస్, కర్నూలు. 84668 87348.

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోటానికి స్త్రీ/పు ఆయా, నర్సులు, వంటవారు, RMP, డాక్టర్స్ కా. జీ: 15-40K. ఫ్రీ రూం+ భో॥ HYD. ✆ 79935 83999.

శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్ కర్నూల్ బ్రాంచ్‌లో ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్ & బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ మరియు ఎమ్మిగనూరు, కోయలకుంట్ల బ్రాంచ్‌లలో కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 99898 66066, 76808 86106.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.